తాడేపల్లిగూడెం నుంచి పవన్ పోటీ..!

ప్రజాశక్తి - పాలకొల్లు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి పోటీచేసే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ నుంచి జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ పోటీ చేయడానికి సన్నాహాలు చేశారు. అయితే పవన్ కల్యాణ్‌ను ఇక్కడ నుంచి పోటీ చేయాలని స్వయాన శ్రీనివాస్ కూడా ఒత్తిడి చేస్తున్నట్లు పాలకొల్లుకు చెందిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఒకరు ప్రజాశక్తికి చెప్పారు. ప్రస్తుతం ఇక్కడి ఎంఎల్ఎ కొట్టు సత్యనారాయణ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. పవన్ కల్యాణ్ ఇక్కడ నుంచి పోటీ చేస్తే రాష్ట్రంలో తాడేపల్లిగూడెం కీలక నియోజకవర్గం కానుంది. అలాగే నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి భీమవరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఒకరు పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఆఖరి దశలో టిడిపితో పొత్తులు ఉంటే సీట్ల మార్పు ఉండొచ్చని ఆయన చెప్పుకొచ్చారు. అలాగే పొత్తు ఉండక పోవచ్చని, ప్రస్తుతం బిజెపితో జనసేనకు పొత్తుందని ఆయన చెప్పారు.

గ్రామస్థాయిలో పోరు విస్తృతం

ముగిసిన ఎపి వ్యకాస 29వ రాష్ట్ర మహాసభ
ఉత్తేజాన్నిచ్చిన ప్రదర్శన, బహిరంగ సభ
ప్రతినిధుల సభలో
విస్తృత చర్చలు, సమీక్షలు
జాతీయ, రాష్ట్ర నేతల దిశానిర్దేశంతో
నూతనోత్సాహం
22 తీర్మానాలు ఆమోదం :
నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

మహాసభలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

గ్రామస్థాయిలో కూలిపేటల్లో పేదలను సంఘటితం చేసి ఐక్య పోరాటాలు విస్తృతం చేయాలనే నినాదాల నడుమ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో ముగిసింది. జంగారెడ్డిగూడెం శివార్లలో దండమూడి రామలక్ష్మి కళ్యాణ మండపంలో మూడు రోజులపాటు ఈ మహాసభ జరిగింది. తొలిరోజు గురువారం స్థానిక మార్కెట్ యార్డు నుంచి బస్టాండ్ వరకూ సాగిన ప్రదర్శన పట్టణవాసులను ఆకట్టుకుంది. అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాది మంది పేదలు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు గిరిజనోద్యమ జాతీయ నేత బృందాకరత్, వ్యకాస జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్ సందేశాలు పేదలు, సంఘం నేతల్లో ఉత్తేజాన్ని నింపాయి. రెండో రోజు సంఘం సీనియర్ నేత పాటూరు రామయ్యచే సంఘ పతాకావిష్కరణతో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ప్రారంభ సభలో సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ ప్రసంగం ప్రతినిధులకు దిశానిర్దేశం చేస్తూ సాగింది. ఈ సభలోనే పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెడుతూ రాష్ట్రంలో గత మూడేళ్లలో చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు మహాసభ ముందుంచారు. అలాగే వ్యవసాయ కార్మికులు ఈ కాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ సంఘం తరపున చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను వివరించారు. దీనిపై 26 జిల్లాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు చర్చించి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే వ్యవసాయ కార్మికులతోపాటు పేదలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 22 తీర్మానాలను మహాసభలో విస్తృతంగా చర్చించి ఆమోదించారు. కేరళ వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు చంద్రన్ ఆ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, పోరాటాలు వివరించారు. అక్కడ వామపక్ష ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు అమలు చేస్తున్న పథకాలు, తోడ్పాటు గురించి వివరించారు. మహాసభ జరిగిన తీరుపై ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామాల్లో పేటలవారీ సంఘాన్ని బలోపేతం చేసి పోరాటాలు ఉధృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. తోటి సంఘం బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జె.విల్సన్‌తోపాటు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామన్న, రైతుసంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వ్యకాస సీనియర్ నేత పి.సోమయ్య, మంతెన సీతారాం సౌహార్ద్ర సందేశాలిచ్చారు. ఆహ్వాన సంఘం తరపున గౌరవాధ్యక్షులు మేకా ఈశ్వరయ్య, డాక్టర్ కె.వజ్ర కిరణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ దండమూడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.రవి, వ్యకాస జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జీవరత్నం, పివి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా దడాల సుబ్బారావు, జి.ఈశ్వరమ్మ, ఎ.రవి, కె.నారాయణ, ఎం.పుల్లయ్య వ్యవహరించారు. చివరి రోజు శనివారం సాయంత్రం నూతన కమిటీ 79 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఏలూరు జిల్లా నుంచి ఎ.రవి, తామా ముత్యాలమ్మ, పశ్చిమగోదావరి జిల్లా నుంచి జక్కంశెట్టి సత్యనారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏలూరు జిల్లా నుంచి ఎం.జీవరత్నం, పిల్లి రామకృష్ణ, తుమ్మల సత్యనారాయణ, శేషపు మహంకాళిరావు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి బాతిరెడ్డి జార్జి, బల్ల చినవీరభద్రం, కండెల్లి సోమరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమాల్లో వ్యకాస జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.జీవరత్నం, పివి.రామకృష్ణ, సిఐటియు నేతలు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, గిరిజన సంఘం నేతలు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, స్థానిక నేతలు సుభాని, వంగా గోపీ, పి.సూర్యారావు, గుడెల్లి వెంకట్రావు, ఎ.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీ జరిగే వరకు పోరు

ఆహ్వాన సంఘం కార్యదర్శి ఎ.రవి

రాష్ట్రంలో పేదలకు భూ పంపిణీ జరిగే వరకు పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం దండమూడి రామలక్ష్మి కళ్యాణ మండపంలో మహాసభ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి పంచాలి కూలి పెంచాలి, వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమం ప్రతి గ్రామంలో విస్తరించాలని అన్నారు.

నిరుద్యోగ కార్మిక సమస్యలపై పోరాటానికి సిద్ధం

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ఉపాధి కోల్పోతున్న నిరుద్యోగ కార్మిక సమస్యపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి నట్టేట ముంచారని విమర్శించారు. ఈ సమస్యపై యువతను చైతన్యపరిచి కార్మిక శక్తితో ఐక్య ఉద్యమాలకు సన్నద్ధమవుతామని తెలిపారు.

ఉమ్మడి పోరాటాలు చేయాలి

వి.కృష్ణయ్య, ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు వ్యవసాయ కార్మికులు, రైతులు భుజంభుజం కలిపి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కష్ణయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ప్రభుత్వమని చెబుతున్నప్పటికీ గతం కన్నా 10 శాతం ఆత్మహత్యలు పెరిగాయన్నారు. చిన్న రైతులు వ్యవసాయం చేయలేని విధంగా పరిస్థితులు మారాయన్నారు. దేశవ్యాప్తంగా కనీస మద్దతు ధర అనే అంశం ముందుకు వస్తుందని తెలిపారు. ఇది రానున్న రోజుల్లో మహా ఉద్యమంగా మారుతుందని అన్నారు. 13 నెలలు రైతులు పోరాడి చారిత్రాత్మకంగా మోడీ మెడలు వంచి విజయం సాధించారన్నారు.

బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దాం

డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల ఫలితంగా కార్మికుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయయాంత్రికరణ పెరుగుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గ్రామీణ సేవకులను ఐక్యం చేసేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మిద్దామని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం యాజమాన్యానికి ఊడిగం చేసేలా కార్మికుల హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. రానున్న రోజుల్లో ఐక్య పోరాటాలు నిర్మించాలన్నారు.

పోరాటమే నినాదం

డాక్టర్ వజ్ర కిరణ్, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు

కార్మికులందరికీ పోరాటమే నినాదం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ వజ్రకిరణ్ అన్నారు. శనివారం మహాసభ ముగింపు కార్యక్రమంలో డాక్టర్ వజ్ర కిరణ్‌ను నేతలు శాలువాతో సత్కరించారు. అనంతరం వజ్రకిరణ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. కార్మికులు ఐక్యంగా హక్కుల కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్మిక సమస్యలపై నిర్వహించే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

రైతులను ఆదుకోండి :సిపిఎం

ప్రజాశక్తి- భీమవరం

మాండూస్ తుపాన్ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాండూస్ తుపాన్ రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుందని, ధాన్యం ఇంకా దాదాపు 40 శాతం మాసూళ్లు కావాల్సి ఉందని తెలిపారు. కొన్ని చోట్ల కోతలు కూడా కోయాల్సి ఉందని, ఇప్పటికే మాసూళ్లు పూర్తయిన ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల నుంచి మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, సంచుల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. చాలా చోట్ల సంచుల కొరత తీవ్రంగా ఉందని, దీన్ని వెంటనే పరిష్కరించి, రైతులకు అవసరమైన సంచులను అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతి రైతుకూ అందేలా చూడాలని, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి బరకాలు కూడా అవసరమవుతాయని పేరొన్నారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన బరకాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పక్కన పెట్టి, కాలయాపన లేకుండా ధాన్యం మొత్తం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. అమ్మిన ధాన్యానికి వెంటనే నగదు జమ చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తుపాన్ వల్ల నష్టపోయే ఇతర పంటల రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూరిగుడిసెల్లో, చిన్న చిన్న నివాసాల్లో ఉండేవారి నివాసాలకు ఏమైనా నష్టం వాటిల్లితే వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తేమశాతం నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధాన్యం పడుతున్న ఆకుల హరేరాం

తేమ శాతం నిబంధనలతో రైతులు ధాన్యం అమ్ముకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ఓ పక్క వర్షాలు పడుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతుంటే తేమ నిబంధన పేరుతో ఆర్‌బికె, రైస్ మిల్లు యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. 15 శాతం పైగా తేమ ఉంటే కొనుగోలు చేయబోమని చెప్పడంతో ధాన్యాన్ని ఏం చేయాలో తెలీని పరిస్థితిలో రైతులున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: రెవెన్యూ అంశాలపై సంబంధిత సిబ్బందికి పూర్తి అవగాహనుండాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ ఇతర రెవెన్యూ సిబ్బందితో వర్క్‌షాప్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ అంశంపై పూర్తి అవగాహన కలిగినప్పుడే ప్రజలకు సరైన న్యాయం చేయగలుగుతామన్నారు. ఎప్పటికప్పుడు వివిధ అంశాలపై, రెవెన్యూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో అట్టడుగు అంశాలను సైతం పరిశీలించాలన్నారు. ధాన్యం కొనుగోలులో తేమశాతం లెక్కింపు, తదితర అంశాలపై రైస్ మిల్లుల వద్ద విధులను కేటాయించిన కస్టోడియన్ అధికారికి పూర్తి అవగాహన కల్పించాలని తహశీల్దారులకు సూచించారు. ఆర్‌బికెలో తేమశాతం లెక్కింపులో రైస్ మిల్లర్ అభ్యంతరం వ్యక్తం చేస్తే దగ్గరలోని బఫర్ గొడౌన్ వద్ద ఉన్న మాయిశ్చరైజర్ మిషన్ ద్వారా లెక్కించాలని సూచించారు. ఇప్పటివరకు 16 మండలాల్లోని 16 గ్రామాల్లో భూ రీ సర్వే పనులు పూర్తిచేశామని, వారికి భూ హక్కుపత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి జెవి.మురళీ, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, సివిల్ సప్లయిస్ డిఎం శివరాం ప్రసాద్, డి.ఎస్ఒ ఎన్.సరోజ, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, అర్ఐలు, విఆర్ఒలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సౌత్ బీచ్‌లో పలు అక్రమ నిర్మాణాలను అధికారులు పటిష్ట బందోబస్తు నడుమ శనివారం కూల్చివేశారు. బీచ్ సుమారు 25 సంవత్సరాలుగా బీచ్‌లో శీతల పానియాలు, అల్పాహారం, భోజన హోటళ్లు నడుస్తున్నాయి. సుమారు 50 కుటుంబాలు బీచ్‌లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నాయి. ఈ క్రమంలో పలువురు తమ దుకాణాలకు గోడలు నిర్మించుకుని రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటితో పాటు సిఆర్‌జెడ్ పరిధిలో కొబ్బరి సాగు చేసుకుంటున్న పలువురు తోటల చుట్టూ స్తంభాలు, ఇనుప కంచెలు, ప్లాస్టిక్ మెస్‌లు ఏర్పాటు చేశారు.

వీటిని అధికారులు బీచ్ అభివృద్ధిలో భాగంగా తెల్లవారుజామున తొలగింపు పనులు చేపట్టారు. సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఎస్‌పి రవిమనోహరాచారి సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు. మొగల్తూరు తహశీల్దార్ జి.అనితకుమారి 140 మంది పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఒకేసారిగా కట్టడాలు తొలగించారు.

అడ్డుకున్న దుకాణదారులు

ఆయా దుకాణారులు తొలగింపును అడ్డుకున్నారు.

తొలగించిన షెడ్లు

అధికారులు వారిని బలవంతంగా పక్కకు నెట్టి దుకాణాలను తొలగించారు. తమకు కొంత గుడువు ఇవ్వాలని, షాపులు తొలగిస్తామని వేడుకున్నా వినకుండా ధ్వంసం చేశారు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలో ధర్నా చేస్తున్న ఆశాలు

ఆశా వర్కర్లను పర్మినెంట్ చేసి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కముజు దుర్గాలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేసి, కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్, చనిపోయిన ఆశా వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు నాగిశెట్టి గంగారావు, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు

పెనుమంట్ర: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.పూర్ణ, సిహెచ్ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం మానవ హక్కుల దినోత్సవం, డిమాండ్స్ డే సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక అలవెన్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన ఆశా వర్కర్లకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల్లో మార్పు ఆపాలని, మరణించిన, రిటైర్డ్ అయిన ఆశా వర్కర్ల స్థానంలో అర్హులైన కుటుంబ సభ్యులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంహెచ్ఎం నిబంధన ప్రకారంగా పట్టణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆశాలను నియమించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. ఎఎన్ఎం శిక్షణ పొందిన ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇచ్చి ఎఎన్ఎంలుగా భర్తీ చేయాలని కోరారు.

ప్రభుత్వంపై నమ్మకం.. వరిసాగుపై ఇష్టం.. లేదా..!

సాగునీటి సలహా మండలి సమావేశానికి ఎంఎల్ఎల డుమ్మాపై సర్వత్రా చర్చ - వరిసాగు అంటేనే 'వర్రీ' అన్పిస్తున్న ప్రభుత్వ విధానాలు

గోదావరి జిల్లాలంటే వ్యవసాయ సాగుకు చిరునామా అని చెప్పొచ్చు. అందులో పశ్చిమగోదావరి జిల్లా అంటే ధాన్యాగారంగా పేరొందింది. అటువంటి జిల్లాలో దాళ్వా సాగుకు సంబంధించి చర్చించేందుకు ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించే సాగునీటి సలహా మండలి సమావేశానికి ఆ జిల్లా పరిధిలోని ఒక మంత్రి మినహా మిగిలిన ఎంఎల్ఎలంతా డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. ప్రధానంగా ఈ సమావేశంలో తాము ప్రస్తావించే అంశాలను ప్రభుత్వం పట్టించుకోదనే భావనే కారణమా.. లేక వరిసాగుపై సదరు ప్రజాప్రతినిధులకు ఇష్టం లేదా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సాగునీటి సలహా మండలి సమావేశంలో గోదావరి నుంచి దాళ్వా సాగుకు అందుబాటులో ఉండే నీరెంత, పూర్తి ఆయకట్టుకు నీరందించగలమా, కాల్వలు ఎప్పుడు మూసేయాలి, మళ్లీ ఎప్పుడు తెరవాలి.. సకాలంలో దాళ్వా సాగుకు ఏం చర్యలు తీసుకోవాలి.. కాల్వలు మూసివేసినప్పుడు చేపట్టాల్సిన ఆధునికీకరణ పనులు తదితర అంశాలపై విస్తృత చర్చ ఈ సమావేశంలో జరగడం సర్వసాధారణం. అయితే దానికి భిన్నంగా గోదావరిలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నందున దాళ్వా సాగుకు ఇబ్బంది లేదని ఏకవాక్యంలో తేల్చేశారు. ఇక కాల్వల మూసివేత, మళ్లీ నీటి విడుదల తేదీల నిర్ణయం, ఆధునికీకరణ పనులపైనా మమ అన్పించేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ సిఎం, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఒక్కరే హాజరయ్యారు. మరో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుగాని, ఆ జిల్లా పరిధిలో ఉన్న అధికార, ప్రతిపక్ష ఎంఎల్ఎలు ఎవరూ హాజరుకాలేదు. దీంతో మంత్రి కొట్టునే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నట్లుగా అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసి సమావేశం ముగించేశారు. 'కొబ్బరికాయలు కొడితే పనులు పూర్తి చేసినట్టా' అంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎందుకంటే పాలకపక్షం, ఆపై సాక్షాత్తూ మంత్రి వ్యాఖ్యలు ప్రభుత్వ పర్యవేక్షణా లోపాన్ని సూచిస్తున్నాయా.. లేక ఆర్థిక అసమర్థతను కప్పిపుచ్చుకునేలా అధికారులపై నెపం నెట్టడమా అనే అంశాలు తెరపైకి వచ్చాయి. నిధులు పుష్కలంగా ఉండి, చేస్తున్న పనులకు బిల్లులు వెంటనే మంజూరవుతుంటే పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందనేది అందరి ప్రశ్న. ఒకవేళ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపమే కారణమైతే సంబంధిత ఒకరిద్దరు అధికారులపై చర్యలు తీసుకునే, సిఫార్సు చేసే హోదాలోనే మంత్రి కొట్టు ఉన్నారు. అలాకాకుండా నిధుల్లేకుండా, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు ముందుకు సాగకపోతే దానికి బాధ్యులెందుకు అవుతారని అంతా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్భాటపు ప్రసంగాలు.. సమీక్షలు మాని పనులు ముందుకు సాగకపోవడానికి మూలకారణం ఏమిటో తెలుసుకుని చర్యలు తీసుకుంటే అటు ప్రజలకు ఉపయోగం.. ఇటు ప్రభుత్వానికి మచ్చ లేకుండా ఉంటుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

దాళ్వా సాగుపై ప్రజాప్రతినిధుల స్పందన అలా ఉంటే గతంలో కనీస మద్దతు ధర అయినా ఇవ్వండని కోరే రైతులు అయ్యా మా ధాన్యం కొనండయ్యా అని దీనంగా వేడుకునే పరిస్థితికి పాలకులు తీసుకురావడం గమనార్హం. తేమ శాతం పేరిట నిబంధనల అడ్డంకి ఒక అడ్డంకి, అది అధిగమించి ధాన్యం ఆర్‌బికెకు విక్రయించినా గోనె సంచుల కొరత, అదీ అధిగమిస్తే లారీల సమస్య రైతులను వెంటాడుతోంది. మొత్తంగా వరి రైతుకు పంట చేతికొచ్చాక అడుగడుగునా ఆటంకాలు ఎదురుకావడం ఆశనిపాతంలా మారింది. దీంతో రైతులు వరి సాగుకు దూరమయ్యేలా ప్రభుత్వ విధానాలున్నాయని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి రైతాంగ అనుకూల విధానాలు చేపట్టకపోతే ఆహారభద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం మండల సమావేశం డి.వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.నాగరత్నం మాట్లాడుతూ జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరగనున్న ఈ మహాసభకు ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వస్తారని తెలిపారు. ఉద్యోగ, కార్మిక సమస్యలపై నిరంతరం పని చేస్తున్న సిఐటియు మహాసభ ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, రైస్‌మిల్ కార్మికులు, ఆటో, రవాణ తదితర కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సిఐటియు మహాసభను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలన్నారు. ఈ మహాసభకు సిఐటియు అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు కె.హేమలత, తపనసేన్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, మద్దాల శ్రీనివాస్, పార్వతి, సావిత్రి, శాంతి, సత్యవతి, మంగమ్మ, రంగారావు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదలకు అండగా తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ పనిచేస్తుందని క్లబ్ అడ్మినిస్ట్రేటర్, లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, చీరలు, మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు కోనా హనుమాన్ ఆధ్వర్యాన మానవహక్కుల మిషన్ జాతీయ నాయకులు ఎస్‌జె.కుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు లయన్ షేక్ బాజీ, కోటేశ్వరరావు, ఎస్ఎన్‌వి.నాగ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. నిరుపేదలకు సహకారం అందించాలన్నారు. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్ పట్నాల రామకృష్ణ, లయన్ యర్రా ఆంజనేయస్వామి, పేరిచర్ల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వివిధ ప్రమాదాల్లో గాయపడిన పలువురికి కుటుంబ పోషణ నిమిత్తం వసుధ ఫౌండేషన్ సహాయం అందించింది. ఆర్.అప్పారావు, దొడ్డా అంజమ్మకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. శనివారం డిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్ రోడ్డులోని దుర్గాదేవి దేవాలయం వద్ద వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎంవి రామరాజు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుమత్స శ్రీధర్ పాల్గొన్నారు.

'జనసేన బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు అన్నారు. జనసేన మండల అధ్యక్షులు ఏరుబండి రామాంజనేయులు, దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం కాళ్లకూరు, దొడ్డనపూడి గ్రామాల్లో జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. కాళ్లకూరు గ్రామ కమిటీ అధ్యక్షులుగా వంగపండు దుర్గా ప్రసాద్, దొడ్డనపూడి గ్రామ అధ్యక్షులుగా కొల్లి పరశురామయ్య, యూత్ అధ్యక్షులుగా అరేటి సందీప్ గ్రామ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గవర లక్ష్మి, ఆకివీడు మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కాళ్ల మండల ఉపాధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

కల్లాల్లో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఎ జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కోపల్లె, బొండాడ రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బందిని ధాన్యం కొనుగోలు గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ ధాన్యాన్ని అన్‌లోడ్ చేసే విధానం, ఎక్కడ నుంచి వచ్చింది తదితర వివరాలను మిల్లర్ల అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆకివీడు ఎడిఎ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకి, రైతులు, కౌలు రైతులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్దా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఎఒ మద్దాల జయదుర్గామాధురి అన్నారు. శనివారం క్షేత్రస్థాయిలో ధాన్యం పట్టుబడిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 17 శాతం తేమ శాతం అని నిబంధన పెట్టినా, రైతుల ఇబ్బందుల దృష్ట్యా తేమశాతం 17 కంటే ఎక్కువ ఉన్నా సరే రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. తేమశాతం పేరుతో రైతులను ఇబ్బంది పడకుండా రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు.

18న పాలకొల్లులో సేవ్ ది గర్ల్ సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం పాలకొల్లులో సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక ఎఎంసిలో శనివారం వివిధ కళాశాలలు, హైస్కూల్ యాజమాన్యంతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద అని అన్నారు. ఆ సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యం తరపున మద్దాల వాసు, గొర్ల శ్రీనివాస్, ఆదినారాయణ, ఎన్‌విఎస్ పాపారావు నాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ ఇఇ విఎస్ సిద్ధాంతి సిబ్బందికి సూచించారు. శనివారం కొత్తకాయల తిప్పలోని జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎఇ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రైమ్-9 విలేకరి రావూరి చెన్నకేశవ శనివారం గుండుపోటుతో మరణించారు. మధ్యాహ్నం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద తోటి విలేకరులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. పాత్రికేయులు వెంటనే చెన్నకేశవుని స్థానిక స్టార్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స చేస్తుండగానే ఆయన కన్నుమూశారు. ఆయన స్వగ్రామం కస్పా పెంటపాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్కాయ్ పోటీలకు ఆకివీడు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆకివీడు

ఈ నెల 6వ తేదీన ఏలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్కాయ్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన డిస్ట్రిక్ట్ స్కాయ్ పోటీల్లో ఆకివీడు విద్యార్థులు విజయం సాధించారు. ఈనెల 17, 18 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వారు ఎంపికయ్యారని కోచ్ గంటా సీను తెలిపారు. అండర్‌గీ14 మోటుపల్లి రేవంత్, అండర్- 9 విభాగంలో గంటా.షైనీ ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఇద్దరు ఇద్దరు ఈ నెల 17,18 న నెల్లూరు లో జరగబోయే రాష్ట్రస్థాయి స్కాయ్ పోటీలకు సెలెక్ట్ అయ్యారని శ్రీను తెలిపారు. ఈ పోటీల్లో నెగ్గిన వారు కాశ్మీర్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు.

ఉత్తమ విద్యే 'విష్ణు' లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలోనే విశిష్ట విద్యా సంస్థలుగా తమ విష్ణు విద్య సంస్థలు తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఉన్నామని విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కెవి.విష్ణురాజు అన్నారు. పద్మశ్రీ డాక్టర్ బివిరాజు ఫౌండేషన్ విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మసీ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేషనల్ ఫార్మా క్విజ్ (మేధా -2022) నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు ఎన్నో రంగాలలో విశేష అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాళ్ల

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కోపల్లెలో తడిసిన ధాన్యాన్ని ఎంఎల్ఎ రామరాజు శనివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆర్‌బికెల్లో ధాన్యం తేమ శాతానికి మిల్లర్ల వద్ద తేమశాతానికి తేడా ఉందన్నారు. దీంతో రైతులను కొంతమంది మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోపల్లె ఉప సర్పంచి బూడి వెంకట పర్రాలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అనుబంధం... అద్వితీయం

వాలీబాల్ నారాయణరాజును జీవితంలో మరువలేం - నాటి క్రీడాకారుల మనోగతం

నారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న క్రీడాకారులు, ప్రముఖులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ముద్దుబిడ్డ.. వాలీబాల్ దత్తపుత్రుడు కీర్తి శేషులు గాదిరాజు నారాయణరాజు క్రీడారంగంలో అందించిన సేవలు అమోఘం. గ్రామీణ ప్రాంతంలో జన్మించిన నారాయణ రాజు క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే ఆయన లక్ష్యం.. గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను తయారు చేసి దేశానికి అందించాలన్నదే ధ్యేయం.. తనకు ఎంతో ఇష్టమైన వాలీబాల్ క్రీడను దేశం నలుమూలలా వ్యాపింపజేయాలనే నిరంతర తపనతో ఆయన తుది శ్వాస విడిచే వరకూ వాలీబాల్ క్రీడ కోసమే జీవించారు. 50 ఏళ్ల ప్రస్థానంలో క్రీడలో ఎన్నో ఒడిదడుగులు ఆటుపోట్లు ఎదురైనప్పటికీ అవేమి లెక్క చేయకుండా క్రీడాకారులకు బంగారు బాట వేశారు. గ్రామీణ ప్రాంతంలో జన్మించిన నారాయణరాజు వాలీబాల్‌తో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఎంతోమందికి వాలీబాల్ నేర్పించి మెలకువలు చెప్పి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ఆయనకే దక్కుతుంది. పాలకోడేరులో మూడు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో అప్పటి క్రీడాకారులంతా ఒకేచోట కలిసిన నేపథ్యంలో నారాయణ రాజుతో తమకున్న అనుబంధాన్ని ప్రజాశక్తితో పంచుకున్నారు.

నారాయణరాజుతో 40 ఏళ్ల అనుబంధం

భగవాన్ దాస్, రిటైర్డ్ ఆర్‌టిసి సూపరింటెండెంట్, రాష్ట్ర వాలీబాల్, విజయనగరం

1980లో భీమవరంలో ఫెడరేషన్ కప్ ఆడుతున్న సమయంలో నారాయణరాజు పరిచయమయ్యారు. అప్పటి నుంచి ఆయనతో విడదీయని బంధం ఏర్పడింది. నా ఉన్నతికి ఎంతో సహాయపడ్డారు. క్రీడలో ఎన్నో మెలకువలు నేర్పించి బాసటగా ఉండేవారు. అటువంటి వ్యక్తి లేకపోవడం బాధాకరం. క్రీడాకారులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి.

వాలీబాల్‌లో వానమాలు దిద్దించారు..

కలిదిండి రాజా, ఇన్కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్, హైదరాబాద్

భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో విద్యనభ్యసిస్తుండగా నారాయణరాజు నన్ను పిలిచి వాలీబాల్‌కు పరిచయం చేశారు. ఆ క్రీడలో స్వయాన ఆయనే వానమాలు దిద్దించారు. నా తల్లిదండ్రులు జన్మనిస్తే నారాయణరాజు జీవితాన్ని నేర్పించారు. క్రీడలో శిక్షణ ఇస్తూ చేయూతనందిస్తూ జీవితాన్ని అందంగా మలిచిన గొప్ప వ్యక్తి నారాయణరాజు. ఆయన వల్లే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించాను. నాలాంటి వాళ్ళు సుమారు 200 మంది ఆయన చొరవతో స్పోర్ట్స్ కోట్లాలో ఉద్యోగం సాధించారు.

నారాయణరాజు రుణం తీర్చుకోలేనిది

సతీష్ వర్మ, డిఆర్‌డిఒ అధికారి, విశాఖపట్నం

డిఎన్ఆర్ క్రీడా ప్రాంగణంలో ఆడుకుంటూ ఉండగా చూసిన నారాయణరాజు వాలీబాల్ ఆటకు పనికొస్తానని మా తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏలూరు స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఆఫ్ ఇండియాలో చేర్పించి శిక్షణ ఇచ్చారు. జిల్లా, రాష్ట్ర, నేషనల్ స్థాయిలో ప్రతిభ కనబర్చాను. నారాయణరాజు పుణ్యమా అని 2002లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాను. ఆయన రుణం తీర్చుకోలేను.

నారాయణ రాజును కోల్పోవడం బాధాకరం

కె.షణ్ముగం, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పీడీ, తిరుపతి

1982లో వాలీబాల్ చేతపట్టుకున్నాను. మహబూబ్‌నగర్‌లో రూరల్ మీట్ జరుగుతున్న సమయంలో నారాయణ రాజును చూశాను. అప్పటి నుంచి మా మధ్య అనుబంధం పెరిగింది. ఆయన క్రీడలో ఎన్నో మెళకువలు నేర్పించారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాను. నారాయణరాజు వంటి మంచి వ్యక్తిని ఎంతో బాధాకరం.

ఆయన సేవలు ఎనలేవనివి..

కటికరెడ్డి నటరాజన్, రిటైర్డ్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) వరంగల్

నారాయణరాజుతో పాటు నేను శివాజీ రాజు, ప్రభాకర్ రాజు, పివి, బుల్లబ్బాయి, తిలక్, కెఆర్‌కె రాజు, అప్పలరాజు పదేళ్ల పాటు జిల్లా వాలీబాల్ జట్టుకు ఆడాం. అప్పటి నుంచి నారాయణరాజుతో ఎంతో అనుబంధం ఏర్పడింది. 20 ఏళ్లపాటు పోలీస్ వాలీబాల్ క్రీడా అధికారిగా ఉన్నాను. 22 ఏళ్లపాటు రాష్ట్రానికి ఎన్ఐఎస్ వాలీబాల్ కోచ్‌గా పని చేశాను. అనేక పదవులు చేపట్టాను. స్పోర్ట్స్ కోటాలో ఎస్ఐ ఉద్యోగం సాధించి ఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ రిటైర్ అయ్యాను.

నాన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తా

గాదిరాజు పవన్ కుమార్‌రాజు, నారాయణ రాజకుమారుడు, పాలకోడేరు

క్రీడాభివృద్ధికి నాన్న నారాయణరాజు ఎంతో కృషి చేశారు. ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించి క్రీడాభివృద్ధికి కృషి చేస్తాను. ప్రస్తుతం పాలకోడేరులో జిఎన్ఆర్, ఎస్ఎజి, ఎఎస్ఆర్ వాలీబాల్ క్లబ్, ఇలా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం. వాటిని భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్తాం.

ఘనంగా సిఆర్ రెడ్డి జయంతి

ప్రజాశక్తి - పోడూరు

కట్టమంచి రామలింగారెడ్డి ప్రముఖ రచయిత సాహితీవేత్త, నటుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అని తాళాబత్తుల వెంకటేశ్వరరావు అన్నారు. గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అధ్యక్షతన శనివారం కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని నిర్వహించారు. ముందుగాసి ఆర్.రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సూర్యకుమార్ మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి సిఆర్ రెడ్డిగా పేరుగాంచారన్నారు. తాళాబత్తుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిఆర్ రెడ్డి విశ్వవిద్యాలయాల బిల్లుకు రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యం.వి.రాజశేఖర్,మజ్జి శ్రీనివాసరావు,సాకా కుమార్ రాజు,కే.డేవిడ్ రాజు,వాసంశెట్టి శ్రీనివాసరావు,గెద్దాడ పెద్దిరాజు మరియు విద్యార్థులు పాల్గొని సి అర్ రెడ్డికి నివాళు లర్పించారు.

మావుళ్లమ్మకు 8 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి గణపవరానికి చెందిన ముద్వ రాంబాబు స్వప్న, దంపతులు 8 గ్రాముల బంగారాన్ని శనివారం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు రాంబాబు దంపతులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సమాన అవకాశాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వోద్యోగాల్లో అన్ని వర్గాలవారికీ సమాన అవకాశాలు కల్పించాలని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడారు. మానవ హక్కుల దినోత్సవాలు జరుపుకోవడమే తప్ప ఆ హక్కులను పేదవాడికి కల్పించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పెరుగుదలకు అనుగుణంగా కనీసం 26 వేల రూపాయలు వేతనం నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెంకి అప్పారావు, తోట పద్మ, షేక్ తద్మీభి, నాగమణి పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పి చైర్మన్ కవురు శ్రీనివాస్ తెలిపారు. ఆగర్తిపాలెంలో 105వ రోజు శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి గత ప్రభుత్వాల్లో ఎప్పుడూ లేదన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు పలు సమస్యలను జెడ్‌పి చైర్మన్ దృష్టికి తెచ్చారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మీ, మండల కన్వీనర్ మైఖేల్‌రాజు, వైస్ ఎంపిపి పి.సునీల్‌బాబు, వైస్ ఎంపిపి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొడమంచిలిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల అందజేస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ఆచంట:రాష్ట్రంలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం కొడమంచిలిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికీ సమన్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొడమంచిలిలో సంక్షేమ పథకాలు, గ్రామ అభివృద్ధి ద్వారా రూ.33 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మెయిన్ స్కూల్లో రూ.48 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసి యల్లమెల్లి బేబీ రాజేష్ పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

అఖిలభారత మహాసభల సందర్భంగా హైదరాబాద్ నక్లెస్ రోడ్డులో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం.జాన్, ఎ.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మీరా గ్రంథాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.జాన్, ఎ.మురళీకృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా నక్లెస్ రోడ్డు వరకూ పెద్ద ఎత్తున ప్రదర్శన బహిరంగ సభ జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సభకు ముఖ్యఅతిథిగా త్రిపుర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈనెల 13 నుండి 16వ తేదీ వరకూ ఉస్మానియా యూనివర్సిటీలోని మల్లు స్వరాజ్యం నగర్‌లో ఈ మహాసభ జరగనున్నట్లు తెలిపారు మహాసభల ప్రారంభ సభకు ముఖ్య ముఖ్యఅతిథిగా జస్టిస్ కె.చంద్రు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శులు కె.మనస్విని, ఎం.సాయికృష్ణ, చిరంజీవి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో జిల్లా వ్యవసాయ అధికారి తనిఖీ

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం ప్రత్యేకంగా 40 శాతం రాయితీతో డ్రోన్ పరికరాలు అందజేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన చినకాపవరం, ఆకివీడు-3 ఆర్‌బికెలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడుతున్నందువల్ల రైతులు 12వ తేదీ వరకూ వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వర్షాల్లో వరి కోతలు కోయొద్దని సూచించారు. ధాన్యం బరకాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆకివీడు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

భీమవరంలో మెడ్ క్వెస్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం జెపి రోడ్డులో మెడ్ క్వెస్ట్ డయాగ్నస్టిక్ సెంటర్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అతిపెద్ద డయాగ్నస్టిక్ సెంటర్ భీమవరంలో 10వ బ్రాంచుగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్య కేంద్రంగా భీమవరం విరాజిల్లుతోందని, మరెన్నో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు మన ప్రాంతంలో ఏర్పాటు చేయడం గొప్ప విశేషమని తెలిపారు. డయాగ్నస్టిక్ ఎమ్‌డి ఫణివర్మ మాట్లాడుతూ హైదరాబాద్‌లో 7 బ్రాంచులున్నాయని, కాకినాడ, తణుకు, భీమవరంతో కలిపి 10 బ్రాంచులతో మెడ్ క్వెస్ట్ డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలే ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మూడున్నరేళ్ల వైసిపి పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. పెన్నాడ గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నాడ పాలెంలో రామరాజు ఇంటింటికీ వెళ్లి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరు ఠాగూర్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు..

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్ పోటీలు శనివారం హోరాహోరీ జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ సత్తా చాటారు. ఒకపక్క వాతావరణం అనుకూలంగా లేనప్పటికీ క్రీడాకారులు వీసు పోకుండా క్రీడల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి జట్లు వివిధ స్థాయిలో ఆడారు. పురుషులు, మహిళా జట్లు క్వాటర్ ఫైనల్ ఆడి సెమీ ఫైనల్‌కు చేరారు. పురుషుల విభాగం నుంచి సెమీఫైనల్‌లో పశ్చిమగోదావరి, ప్రకాశం, విశాఖపట్నం, కృష్ణా జిల్లా జట్లు చేరాయి. మహిళా విభాగం నుంచి సెమీఫైనల్‌కు కృష్ణ, విశాఖపట్నం జిల్లాలు చేరాయి. క్వాటర్ ఫైనల్ నుంచి పశ్చిమగోదావరి, అనంతపురం జట్లు చేరగా మరో మ్యాచ్లో గుంటూరు, తూర్పుగోదావరి జట్లు సెమీ ఫైనల్‌కు చేరాయి.

క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

వాలీబాల్ అంటేనే నారాయణరాజు

వాలీబాల్ క్రీడకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వ్యక్తి కీర్తిశేషులు నారాయణరాజు అని, వాలీబాల్ అంటేనే నారాయణరాజ అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు మూడో రోజుకు చేరాయి. దీనిలో భాగంగా డిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాది రాజుబాబు, టిడిపి సీనియర్ నాయకులు మెంటే పార్థసారథి పాటు క్రీడా ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు క్రీడలను సందర్శించి నారాయణరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

బ్యూటీ పార్లర్ పేరుతో వ్యభిచారం

నిర్వాహకురాలు, విటుడు అరెస్టు
ఏడుగురు మహిళలను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బ్యూటీ పార్లర్, స్పా పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేసి, ఏడుగురు మహిళలను రక్షించారు. ఒక నిర్వాహకురాలిని, ఒక విటుడుని అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి బి.శ్రీనాథ్ తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు సిద్దిపేట చెందిన బోరాడ ఝూన్సీలక్ష్మి, పాలకోడేరు మండలం వేంద్ర గ్రామానికి చెందిన ఇంటి రాహుల్ ఇద్దరు గత కొంతకాలంగా స్థానిక అడ్డవంతెన వద్ద పిఎస్ఆర్ కాంప్లెక్స్ రెండో ఫ్లోర్లో ఓ ప్లాట్‌ను అద్దెకు తీసుకుని, ఏ 9 బ్యూటీ సెలూన్ అండ్ స్పా పేరుతో ఇతర ప్రాంతాల నుంచి మహిళలు తీసుకొచ్చి వ్యభిచారం చేస్తున్నారన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్ ఆదేశాల మేరకు ఎస్ఐలు అప్పారావు, రాంబాబు, సిబ్బందితో దాడి చేసి ఝూన్సీ లక్ష్మిని, విటుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఏడుగురు మహిళలను రక్షించామని తెలిపారు. రాహుల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి నుంచి రూ.31,500, సెల్‌ఫోన్లు, స్వైపింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐ కృష్ణకుమార్, ఎస్ఐలు అప్పారావు, రాంబాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా, గణపవరం మండలం, జల్లికాకినాడ గ్రామ కాపురస్తులయిన అనిపే వేదకుమారి, తండ్రి: చిన్న లక్ష్మణరావు అను నేను నాయొక్క పాస్‌పోర్ట్ జల్లికాకినాడ నుండి గణపవరం ఆటోలో వస్తూ ఉండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. పాస్‌పోర్ట్ ఉన్న కవరు పోయినది. నాయొక్క పాస్‌పోర్ట్ నెం. **P0637835.** కావున పాస్‌పోర్ట్ దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

అనిపే వేదకుమారి, D/o. చిన్న లక్ష్మణరావు
జల్లికాకినాడ గ్రామం, గణపవరం మండలం
ఏలూరు జిల్లా, సెల్: 97053 28655

మహారాజశ్రీ 1వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : తణుకు

O.S.No. 442/2020

Between:
Vijaya Bank, Now Bank of Baroda
...Plaintiff
AND
Tholeti Peda Narasimha Rao
Tholeti Mangatayaru
Vemula Aswani Kumar
...Defendants

ప్రకటన

పై నెంబరు గ్రంథములో మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికినిన్ని అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు చేసియున్నారు. పైనెంబరు గ్రంధము **ది.15-12-2022వ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున సదరు తేదీన మీరు ముగ్గురూ ప్రత్యక్షంగా కాని, పరోక్షమంగా కాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10:00 గంటలకి హాజరు కావల్సినదిగా ఈ ప్రకటన ద్వారా తెలుపడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తణుకు, **ఓ.ఎన్.కృష్ణ**
03-12-22. అడ్వకేట్, తణుకు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **శ్రీమతి ఆకుల గంగాదేవి** (సెల్: 7674088811) భర్త: ఆకుల అజయ్‌కుమార్, నార్ని వీరేశలింగం వీధి, గాంధీనగర్, ఏలూరు, ఏలూరు జిల్లా వారి యొక్క సంజాయిషీ ప్రకారం యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా,

ప్రస్తుత ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వడ్డిగూడెం గ్రామానికి చెందిన లేటు శ్రీ ఘంటసాల రాజు గారి భార్య శ్రీమతి ఘంటసాల వెంకాయమ్మ మరియు వారి కుమారుడు ఘంటసాల వెంకటరావు అను వార్లకు వారి పూర్వార్జితపు ఆస్తిగా వున్నటువంటి షెడ్యూల్ ఆస్తిని, నా క్లయింట్ సదరు ఆస్తిని క్రయ రిజిస్టర్ చేయించుకొనుటకు గాను క్రయ అగ్రిమెంటు వ్రాయించుకుని ఉన్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికన్నా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల ఈ నోటీస్ ప్రకటించిన తేదీ నుండి 7 రోజుల లోపల తెలియజేయవలెను. లేనియెడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించబడుతుంది.

<u>షెడ్యూల్ ఆస్తి వివరము:</u> ఏలూరు జిల్లా, పాత పశ్చిమగోదావరి జిల్లా, వట్లూరు సబుడి, పెదపాడు మండలం, వడ్డిగూడెం పంచాయతీ, కొణికి గ్రామంలోని సర్వే నెంబర్ 381/1A లో గల య. 0.76 ట్ల చెరువు భూమికి గల హద్దులు:

తూర్పు: ముంగర విష్ణు యొక్క భూమి. **దక్షిణం:** ఆకుల గంగాదేవి యొక్క భూమి. **పడమర:** కొండయ్య కోడు అనే కాలువ. **ఉత్తరం:** ఘంటసాల బాలరాజు భూమి.

ఎన్.వి.సత్యనారాయణ, అడ్వకేట్
ఏలూరు పడమర వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా
10-12-2022 సెల్: 9440376655